కవితా కౌముది

## చలిగాడు

పవన్ కుమార్ గజవల్లి

ధగధగాయమానమైన తెలుపు
చంద్రుడు నేలమీద పడ్డట్టు
రజతం, దుమ్ముదులుపుకొని
స్నానం చేసివచ్చి అంతా పరుచుకున్నట్లు
చందమామను వెక్కిరించినట్లు
హల్క్ లాంటి వాడెవడో భూబంతికి తెలుపురంగు
అధినట్లు
నేలంతా తెల్లని తెలుపు
పాడు చలిగాడు
చడీ చప్పుడూ లేకుండా
ఇంటి మీద కారు డిప్పలమీద
తెల తెల్లని టోపీలను పెట్టి పోతాడు
ఊరంతా ధవళమేదో చల్లివెళ్తాడు
తలుపులను తెరవనివ్వడు
కునుకులను తియ్యనివ్వడు
స్వేచ్ఛగా తిరగనివ్వడు.
సరదాలకు వెళ్ళనివ్వడు
కొత్త బట్టలు కట్టనివ్వడు.
పెరుగుని తోడనివ్వడు
దోశపిండిని మురగనివ్వడు
నెచ్చెలిని వదలనివ్వడు
నెగడును వీడనివ్వడు.

నాలుగు నెలలే అంటాడు.
ఎక్కువ రోజులు ఉంటాడు
రవినైనా వణికిస్తాడు
వానకు మాత్రం కరిగేస్తాడు.
చలిగాడా.
తూర్పు దేశపు దక్షిణాన్నుంచి
పడమర దేశపు ఉత్తరానికి వచ్చినప్పుడే
తెలిసింది నీ గురించి ... నీ ప్రతాపాన్ని గురించి
చేయక గోల చేయక
కలతపెట్టక విసుగు పెట్టక,
వేగిరమ్ముగ వెళ్ళి పోరా
లేటుగా తిరిగి రారా
ముందుగా వెళ్ళిపోరా !!!

★★★



# రంగుల విస్తృతి

## చిటిప్రోలు సుబ్బారావు

అక్కడ నింగితెర తొలగింది
ఇక్కడ నేలపరదా జరిగింది!
విశ్వవిభూతి ప్రదర్శనలో
ఎవరి వైదుష్యం వారిది
ఎవరి నైపుణ్యం వారిది !
అక్కడ మ్రోగిన ఉరుముల దుందుభి
ఇక్కడ ధ్వనించిన ఘోషల ఢంకా !
అక్కడ తటిల్లతల ఒంపులుసొంపులు
ఇక్కడ వాగులవంకల ఒయ్యారాలు !
అక్కడ మిణుకుమిణుకుమంటూ బృహత్తారలు
ఇక్కడ మిలమిలలాడుతూ లఘుతర మిణుగురులు!
అక్కడ చల్లని చంద్రబింబం
ఇక్కడ శీతల హిమసరోవరం!
అక్కడ భగభగ మండే అగ్నిజ్వాలలు
ఇక్కడ కణకణ రగిలే కొండలకొలుములు !
అక్కడ మేఘసందేశాలు
ఇక్కడ హంసరాయబారాలు !
అక్కడ ఎల్లెడలా నీలిమ రాజ్యం
ఇక్కడ నలుదెసలా పచ్చటి భాగ్యం!
పాత్రలుడిగి ఆగిన రూపకమక్కడ
సాగుతున్న సజీవ నాటకమిక్కడ !
వెంబడివెంబడి వేదికనెక్కిన
కోయిల పాటలు నెమలి ఆటలు
లేడి గంతులు ఉడుత పరుగులు
చివరి దృశ్యంగా

చక్కదనంతో కంటి కడుపునింపుతూ
మనసుపటాన్ని రంగుల్లో ముంచుతూ
మృదుస్పర్శలతో కాఠిన్యాన్ని కరగిస్తూ
పచ్చదనం ప్రసవించిన పసిపాపల్లా
లలిత నిర్మల పూలతతులు

తెలుపూనలుపుల నింగి
రంగురంగుల నేల ముందు చిన్నబోయింది

ప్రదర్శనలు సమాప్తమనుకుంటుండగా
దివికీభువికీ నడుమ సేతువుగా వెలసిన
రంగురంగుల ఇంద్రచాపం

మరిప్పుడు గెలుపెవరిది
నింగిదా నేలదా

(2022 ఏప్రిల్ నెలలో సియాటిల్ సమీపం లోని
స్కాజిట్ తులిప్ ఫెస్టివల్ లో మైదానంలా
పరచుకున్న రంగురంగుల పూల విస్తృతిని
చూశాక)

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎచటనుండి పిలుచుచుంటివీ క్షణాన
వినుదు నీ గొంతు నీ రూపు కనగలేను
స్వప్నమిది కాదు నీ గొంతు పరిచితమ్మె
చెలియ నీ రాకనెదమ్రోడు చిగురు తొడగె

ఏల దాగెదు కనిపించనేమి శ్రమము
ఏండ్లు పూండ్లెన్నొ గడచినవీవు వెడలి
ఎపుడు నిను జూతునంచునూహింపలేదు
ఇచటనే యుండి కానరావేమి నేడు

అమరగానమై నా శ్రవణముల తాకు
నమృతతుల్యమౌ నీ మధురాక్షరములు
ఎటుల వినుచుంటి నీగొంతునిపుడు నేను
అర్థమే కానిదీ యద్భుతానుభమము

ధరణి యంచులు దాటి నీవరిగినంత
ఆత్మ మిగిలెను శూన్యగేహమ్ము వోలె
ద్వారములవన్ని బంధింపబడినవెపుడొ
ఈ గుహాంతరమున బ్రతుకీడ్చుచుంటి

ఏమి యర్థము నీ మాటకీ దినాన
నీవు వచ్చితివో లేక నేను వచ్చు
చుంటినో తెలియని వింతయూహ యిద్ది
ఎన్నడైనను మన యైక్యతే నిజమ్ము

COMMENTS